# జానకీ కల్యాణం

"మీరలా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటే పన్లెలా జరుగుతాయండీ?! ముహూర్తం ఇంక పట్టుమని పదిహేను రోజులే వుంది. ఇల్లు చూడబోతే అయ్యవారి నట్టిల్లులా వుంది. ఎక్కడో అక్కడ తలతాకట్టుపెట్టైనా సరే పైకం తేవాలికాని మీనమేషాలు లెక్కడుతూంటే సరిపోతుందా? బయటకు వెళ్లి ప్రయత్నించాలికాని! "భార్య అన్నపూర్ణమ్మ మాటలు ఫిరంగి గుళ్లలా తగిలేయి చిదానందానికి.

చిదానందం రెండో కూతురు జానకికి పెళ్ళి నిశ్చయమైంది. మంచి సంబంధం. కుర్రాడు బుద్ధిమంతుడు. గవర్నమెంటు ఉద్యోగం. వియ్యాలవారు కోరిన కట్నం సొమ్ము పాతిక వేలరూపాయలూ భార్య వొంటి మీదవున్న బంగారు నగలు, ఇంట్లో మిగిలివున్న వెండి వస్తువులూ అమ్మి వారికి ముందుగానే సమర్పించేడు. కాని పెళ్లి ఖర్చులకు మరో పదిహేను వేలు వుంటూనే కాని శుభకార్యం నెరవేరదు.

ఆఫీసులో పి.ఎఫ్. మీద లోను ఎల్.ఐ.సి మీద లోనూ యిదివరకే పెద్దకూతురు పెళ్లికి వాడేసుకున్నాడు. వాటిమీద అదనంగా మరేమీ ఇవ్వరు. ఏ హామీలేకుండా పెద్దమొత్తం అప్పు యివ్వగల సమర్థులు యిటు బంధువుల్లోకాని, అటు స్నేహితుల్లోకాని ఎవరూ కనిపించలేదు చిదానందానికి. ఏమి చెయ్యాలో అంతుపట్టక పరధ్యాన్నంగా నడుస్తున్న చిదానందానికి అతని చిన్ననాటి స్నేహితుడు 'దైవసహాయం' కలిసాడు.

"ఏవిట్రా చిదానందం ఆదివారం నాడు కూడ అంతడల్‌గా వున్నావేంటి? పద ఓకప్పు కాఫీసేవిద్దాం" అంటూ ఎదురుగా వున్న హోటలుకు తీసుకెళ్ళేడు చిదానందాన్ని.

దైవసహాయం జల్సాపురుషుడు. ఏభై ఏళ్లు నిండినా పెళ్లిమాట ఎప్పుడూ తలపెట్టలేదు. 'పెళ్లాం, పిల్లలు, సంసారం వగైరా తనతత్వానికి సరిపడవు' అంటాడు. అతనికి వచ్చే నెలజీతం ఎనిమిదివేలూ సినిమాలు, షికార్లు, బట్టలకి జల్సాగా ఖర్చు చేస్తాడు. ఎప్పుడు నీట్‌గా టిఫ్‌టాప్‌గా వుంటాడు.

దైవసహాయం పరమనాస్తికుడు. దేముడు, గుళ్లు, గోపురాలు, పూజలు, నోములు, వ్రతాలు బొత్తిగా గిట్టవు. మాధవసేవ మీద నమ్మకం లేదు.

"ఎన్నో పోషకవిలువలున్న పాలను 'పాలాభిషేకం' పేరిట రాళ్ళపాలు చేయడం పరమమూర్ఖత్వం. ఆ పాలను గుక్కెడు పాలకు నోచుకోని అనాధ పసిపిల్లలకివ్వరాదా?" అంటాడు.

"ఎంతో ఔషధవిలువ కల్గిన నారికేళ జలాన్ని అభిషేక రూపేణా నేలపాలు చేసేకన్నా దానిని పేదరోగులకు యివ్వకూడదా?" అంటూ వాదిస్తాడు.

"వేలకు వేలు ఖర్చు చేసి పోటీలు పడి 'దేవుడి కల్యాణం' అంటూ విగ్రహాలకు పెళ్లిళ్లు జరిపిస్తారు కాని నిరుపేదల పిల్లల పెళ్ళికి తృణమోఫణమో యిచ్చి సహాయపడరు కదా" అంటూ విచారిస్తాడు. దైవసహాయాన్ని సహాయం కోరిన వారిచెప్పుడూ నిరుత్సాహపర్చడు. ఏ సమయంలో వచ్చినా వచ్చినవారికి తనచేతనైన సహాయం చేస్తాడు. అయితే దేవుడి పేర చందాలు వసూలు చేసేవారిని ఆమడదూరం తరిమికొడతాడు.

చిదానందం కాఫీ చప్పరిస్తూ తన గోడునంతా దైవసహాయానికి చెప్పి ఎలాగైనా తనకూతురు పెళ్లి జరిగేలా చూడమన్నాడు.

"చూడు చిదానందం! దిగులు పడుతూ కూర్చుంటే లాభం లేదు. ప్రస్తుతం నా పర్సులో పదిహేనువందలున్నాయి. ఇవి తీసుకెళ్ళిపన్లు మొదలుపెట్టు. ఈ రోజు ఆదివారం కదా! నీకు లక్ష్మీవారం ఉదయం మొత్తం పదిహేనువేలు సమకూర్చి యిచ్చే బాధ్యతనాది" అంటూ స్నేహితుడికి కొండంత ధైర్యాన్నిచ్చి పంపించేడు దైవసహాయం.

"నిత్యానందయతీ-నిత్యము నిన్నే నమ్మితి దివ్య సందర్శనమిచ్చి-భవ్య చరితను బ్రోవవచ్చి..."

"లిస్ట్ రాయడం ఎంతవరకూ వచ్చింది సుందరమ్మా?" అంటూ పాట మధ్యలో ఆపి అడిగింది పార్వతమ్మ.

"ఇంచుమించు పూర్తయినట్లే. మరో ఇరవై పేర్లు రాస్తేసరి. పూర్తవగానే జిరాక్సు తీయిద్దాం. నాలుగు కాపీలుండం మంచిది" అంది సుందరమ్మ.

"అన్నట్లు హుండీ కలెక్షను ఎంత వచ్చిందన్నావూ?"

"ఎనిమిదివందల నాలుగు రూపాయల అరవైపైసలు"

"లిస్టులో చివర్న హుండీ వసూళ్లు అని అదికూడ చేర్చు. మనభక్త మండలి ద్వారా కనీసం ఇరవై వేలైనా నిత్యానందస్వామివారి ఆశ్రమ నిర్మాణానికి డొనేషన్ ఇవ్వకపోతే బావుండదు.'

' అన్నారు పార్వతమ్మ గారు.

పార్వతమ్మగారు రిటైర్డు తహసీల్దారు పరమేశంగారి భార్య. వారికి సంతానం లేదు. విజయనగరంలో లంకవీధిలో వారికి పిత్రార్జితం లంకంత ఇల్లు వుంది. వాళ్లు వుండగా క్రింద మూడువాటాలూ మేడమీద నాలుగు వాటాలూ అద్దెకిచ్చేరు. కాంపౌండులో ఔటుహౌస్ అన్ని సదుపాయాల్తో ఒకటివుంది.

పార్వతమ్మగారు భర్త ఉద్యోగంలో వుండగానే తీర్థయాత్రలన్నీ చేసేరు. ఇక తను తీరిక సమయాన్నంతా దైవచింతనలో గడపాలనుకున్నారు. వారికి తీర్థయాత్రల్లో నిత్యానంద స్వాముల వారితో పరిచయమైంది.

నిత్యానంద స్వాములు నిరాడంబరులు. గీతోపన్యాసమివ్వడంలో దిట్ట. అతను తన ఉపన్యాసశక్తితో ఎంతటి నాస్తికులనైనా ఆస్తికులుగా చేయగల ధీమంతులు.

నిత్యానందులవారి నిరాడంబరత, ఉపన్యాసశక్తికి పార్వతమ్మగారు ముగ్దులయ్యారు. వారిని తమ గృహం పావనంచేసి పాదపూజలందుకొమ్మని కోరారు. స్వామీజీ వారికోరిక కాదనలేక పోయారు. గత నాలుగేళ్ళుగా స్వామీజీ ప్రతి సంవత్సరం పార్వతమ్మ గారింటికి వచ్చి వారిచే పాదపూజలందుకున్నారు.

పార్వతమ్మగారు తమ ఔటుహౌస్‌ను పూజామందిరంగా మార్చుకొని అందులో స్వామీజీ ఫొటోలు వుంచారు. మహిళాభక్తమండలి నొకటి స్థాపించి దానికి పార్వతమ్మగారు ప్రెసిడెంటు, సుందరమ్మగారు సెక్రటరీగా వుంటూ పూజామందిరంలో ప్రతిదినం స్వామీజీ భజనలు చేస్తున్నారు.

నిత్యానంద స్వామీజీ నివాసం గౌతమీ తీరంలో చిన్న కుటీరం. స్వామీజీ భక్త సమాజాలు అన్ని వూర్లలోనూ వున్నాయి. స్వామీజీ కుటీరానికి చుట్టూవున్న పది ఎకరాల స్థలం భక్తులు కొన్నారు. అందులో స్వామీజీకి చక్కటి ఆశ్రమం నిర్మించి ప్రార్థనామందిరం, గెస్ట్‌రూములు కట్టించాలని సంకల్పించారు. అందుకుగాను భక్త సమాజాలు విరివిగా చందాలు వసూలు చేస్తున్నారు.

పార్వతమ్మగారు స్వామీజీ ఆశ్రమ నిర్మాణానికి తమ భక్తమండలి సభ్యులద్వారా ఇరవైవేల రూపాయలు వసూలు చేసేరు. ఆ సొమ్ము స్వామీజీకి పాదపూజలో సమర్పించాలని నిశ్చయించుకొని వారి రాకకై ఎదురుచూస్తున్నారు.

ఆ రోజు ఉదయం మెయిల్లో స్వామీజీ వస్తున్నట్లు టెలిగ్రాం వచ్చింది. పార్వతమ్మగారి ఆనందానికి అవధుల్లేవు. స్వామీజీని రిసీవు చేసుకొని తీసుకురావడానికి సుందరమ్మగారి

అబ్బాయి గురుచరణంని స్టేషన్‌కి పంపించారు. స్వామీజీ ఎప్పుడు వచ్చినా గురుచరణమే వెళ్ళివారిని తీసుకురావడం, తిరుగు ప్రయాణమప్పుడు వారిని రైలెక్కించడం చేస్తూ వుంటాడు. స్వామీజీకి గురుచరణంపై ఆప్యాయత హెచ్చు.

గుమ్మంలోకారు ఆగగానే పార్వతమ్మగారు, మరికొందరు భక్తులు బయటకు వచ్చారు.

"స్వామీజీ ఆశ్రమ నిర్మాణపనుల్లో చాలా బిజీగా వున్నారట అందువల్ల వారి శిష్యులు బ్రహ్మానందంగారిని పంపించారు" అన్నాడు గురుచరణం.

చినస్వామీజీ బ్రహ్మానందంగారికి పార్వతమ్మగారు సాష్టాంగ ప్రణామంచేసి వారిని సగౌరవంగా పూజామందిరానికి తీసుకువెళ్ళారు.

బ్రహ్మానందంగారు స్నాన సంధ్యాదులు ముగించుకొని జింక చర్మంతో చేసిన చేతిసంచిలో నుండి స్వామీజీ పాదుకలు బయటకు తీసి వాటిని పళ్లెంలో వుంచి పూజ చేసి పార్వతమ్మగారి చేత కూడా పూజ చేయించారు. తరువాత కొంత సేపు ప్రార్ధనలు భజనలు చేసి తీర్థప్రసాదాలు పంచారు.

పార్వతమ్మగారు స్వామీజీ ఆశ్రమ నిర్మాణానికి తమభక్త మండలి ద్వారా వసూలు చేసిన చందాసొమ్ము పాదపూజలో సమర్పించారు.

"'నాకు గురువాజ్ఞ ఒక్కపూటవుండమని. వారి ఆజ్ఞను అతిక్రమించలేను" అని సాయంత్రం బండిలో తిరుగు ప్రయాణమయ్యారు చిన స్వామీజీ బ్రహ్మానందంగారు.

గురుచరణం వారిని రైలెక్కించి వచ్చాడు.

'నూరు అబద్ధాలాడైన సరే ఒక్క పెళ్లి చెయ్యమన్నారు' అయితే నిత్యానందస్వామీజీ శిష్యుడు బ్రహ్మానందాన్నని తను ఒకే ఒక అబద్ధమాడి తన స్నేహితుడు చిదానందం కూతురు జానకి కల్యాణం జరిపించడానికి సహాయ పడినందుకు ఎంతో ఆనందించాడు దైవసహాయం.

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 4-4- 1997)** ✪